సాక్షి

అల్లూరి సీతారామరాజు జిల్లా

శుక్రవారం । 22 । మార్చి । 2024



అప్పన్నకు విశేషంగా ఏకాదశి ఆర్జిత సేవలు IIలో

ఏకాదశిని పురస్కరించుకుని వరాహ లక్ష్మీ నృసింహస్వామికి ఆర్జిత సేవలు నిర్వహించారు.



సిరులు కురిపిస్తున్న బర్లీ పొగాకు IIలో

మన్యంలో వేసవి పంటగా వైట్‌బర్లీ పొగాకు పంట రైతులకు కాసులు కురిపిస్తోంది.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ (శుక్ర)	సహర్ (శని)
పాడేరు, అరకు	6.13	4.45
రంపచోడవరం	6.11	4.44

న్యూస్‌రీల్

ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు స్పందన రద్దు

- కలెక్టర్ విజయ సునీత

సాక్షి,పాడేరు: సార్వత్రిక ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులో ఉన్నందున పాడేరు ఐటీడీఏ కార్యాలయంలో స్పందన కార్యక్రమాన్ని రద్దు చేసినట్టు కలెక్టర్ ఎం.విజయ సునీత గురువారం ఓ ప్రకటనలో తెలిపారు.ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు స్పందన కార్యక్రమం నిర్వహించడం జరగదని, అర్జీదారులు శుక్రవారం రోజున వినతిపత్రాలు ఇచ్చేందుకు పాడేరు ఐటీడీఏకు రావొద్దని పేర్కొన్నారు. ఎన్నికల ప్రక్రియ అనంతరం స్పందన కార్యక్రమం జరుగుతుందని, ఈ మార్పును జిల్లావాసులు గమనించాలని ఆమె సూచించారు.

మన్యంలో దట్టంగా పొగమంచు



పొగమంచుతో హెడ్‌లైట్లు వేసుకుని ప్రయాణిస్తున్న వాహన చోదకుడు

సాక్షి,పాడేరు: వేసవిలోనూ మన్యం శీతాకాలాన్ని తలపిస్తోంది. రెండు రోజుల నుంచి మబ్బు వాతావరణం, తేలికపాటి వర్షం కురవగా, బుధవారం అర్ధరాత్రి నుంచి పొగమంచు తీవ్రత నెలకొంది. పాడేరుతో పాటు హుకుంపేట, అరకులోయ, జి.మాడుగుల, చింతపల్లి ప్రాంతాల్లో ఉదయం 8 గంటల వరకు పొగమంచు దట్టంగా కురిసింది. వాహన చోదకులు హెడ్‌లైట్లు వేసుకుని వాహనాలు నడిపారు.


చట్టాలు, హక్కులపై అవగాహన తప్పనిసరి



మాట్లాడుతున్న పాడేరు జడ్జి ప్రదీప

పాడేరు: విద్యార్థులు ప్రాథమిక దశ నుంచే హక్కులు, చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని, ప్రశ్నించేతత్వం అలవర్చుకోవాలని పాడేరు ప్రథమ శ్రేణి జ్యూడిషియల్ కోర్టు జడ్జి పి. ప్రదీప సూచించారు. పట్టణంలోని కుమ్మరిపుట్టు గిరిజన బాలికల గురుకుల కళాశాలలో గురువారం విద్యార్థినులకు న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. క్రమశిక్షణతో కూడిన విద్య నేర్చుకోవాలని ఆమె సూచించారు. లక్ష్యాలను నిర్దేశించుకుని వాటిని సాకారం చేసుకునేందుకు ఇష్టంగా కష్టపడాలని సూచించారు. అంతకు ముందు పాఠశాల పరిసరాలను పరిశీలించారు. కళాశాలకు ప్రహరీ, విద్యార్థినులకు చాలినన్ని మరుగుదొడ్లు లేకపోవడంతో అసహనం వ్యక్తం చేశారు. సమస్యను మండల న్యాయ సేవాధికార సంస్థ తరపున అధికారులకు తెలియజేసి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో మండల న్యాయ సేవాధికార సంస్థ సభ్యులు తమర్బ ప్రసాద్ నాయుడు, కోర్టు సిబ్బంది, పాఠశాల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మి హుండీ ఆదాయం రూ.43.31లక్షలు



హుండీ ఆదాయం లెక్కిస్తున్న సిబ్బంది

డాబాగార్డెన్స్: కనకమహాలక్ష్మి దేవస్థానంలో జనవరి 24 నుంచి ఈ నెల 21వ తేదీ వరకు హుండీల ద్వారా వచ్చిన ఆదాయాన్ని గురువారం లెక్కించారు. మొత్తం రూ.43,31,258 నగదు వచ్చినట్లు ఈవో శ్రీనివాసులరెడ్డి తెలిపారు. అలాగే 24 యూఎస్ డాలర్లు, 2 ఖతార్ రియాల్స్, 50 ఈజిప్షియన్ పౌండ్స్, 5 టర్కిష్ లిరాలు, 60 సౌదీ రియాల్స్, 60 ఆస్ట్రేలియన్ డాలర్స్, 24 సింగపూర్ డాలర్స్‌తో పాటు చైనా, కెనడాకు చెందిన కరెన్సీ, 214 గ్రాముల 500 మిల్లీగ్రాముల బంగారం, 796 గ్రాముల వెండి వచ్చిందని ఈవో వివరించారు. కనకమహాలక్ష్మి దత్తత ఆలయమైన అంబికాబాగ్ సీతారామచంద్రస్వామి ఆలయానికి సంబంధించి రూ.25,484 ఆదాయం వచ్చిందని వెల్లడించారు. హుండీ లెక్కింపులో ఎర్నిమాంబ ఆలయ ఈవో డీవీఎస్ సురేష్‌బాబా, కనకమహాలక్ష్మి ఆలయ ఏఈవో కె.తిరుమలేశ్వరరావు, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అసిస్టెంట్ మేనేజర్ టి.ప్రశాంత్, వన్‌టౌన్ పోలీసులు, శ్రీహరి సేవ సభ్యులు పాల్గొన్నారు.

ఇక్కడ

సిద్ధం

అక్కడ

గందరగోళం



- ఇప్పటికే అన్ని సీట్లను ఖరారు చేసిన అధికార పక్షం
- ప్రచారంలోనూ దూకుడు పెంచిన అభ్యర్థులు
- పలుచోట్ల అభ్యర్థులను ప్రకటించలేకపోతున్న కూటమి నేతలు
- ఓటమి భయంతో మీనమేషాలు
- మరోపక్క పొత్తులపై మిత్రుల కత్తులు
- విభేదాలతో వీధికెక్కుతున్న అసంతృప్తులు

సాక్షి, విశాఖపట్నం : విజయంపై ధీమాతో ఉన్న అధికార వైఎస్సార్ సీపీ .. ఉమ్మడి విశాఖ జిల్లాలో ఇప్పటికే అసెంబ్లీ అభ్యర్థులను ప్రకటించింది. ఒక్క అనకాపల్లి లోక్‌సభ సీటు మినహా మిగిలిన అన్ని స్థానాల జాబితానూ విడుదల చేసింది. దీంతో ఆయా అభ్యర్థులు ఎన్నికలకు సిద్ధం అంటూ ప్రచారంలో దూసుకుపోతున్నారు. ఆ పార్టీ క్యాడరు కూడా ఊరు వాడల్లో ఉత్సాహంగా పాల్గొంటున్నారు. వైఎస్సార్ సీపీ జెండాలను రెపరెపలాడిస్తున్నారు. అయితే ఓటమి భయం వెంటాడుతున్న ప్రతిపక్ష కూటమి టీడీపీ, జనసేన, బీజేపీలు తమ ఉమ్మడి అభ్యర్థులను ప్రకటించే సాహసం చేయలేకపోతున్నాయి. తూతూ మంత్రంగా కొద్దిమంది పేర్లను మాత్రమే ప్రకటించి, మిగతా వారి పేర్లు వెల్లడించడానికి మీనమేషాలు లెక్కిస్తున్నాయి. ఉమ్మడి విశాఖ జిల్లాలోని విశాఖ, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల పరిధిలో 16 అసెంబ్లీ, మూడు లోక్‌సభ స్థానాలున్నాయి. వీటిలో కూటమి పార్టీలు ఇప్పటివరకు అనకాపల్లి (జనసేన), నర్సీపట్నం, పాయకరావుపేట, మాడుగుల, విశాఖ తూర్పు, పశ్చిమ, గాజువాక, అరకు, రంపచోడవరం (టీడీపీ) అసెంబ్లీ స్థానాలకు మాత్రమే అభ్యర్థులను ఖరారు చేశారు. మిగిలిన స్థానాల్లో (యలమంచిలి, పెందుర్తి, విశాఖ దక్షిణ, ఉత్తర, భీమిలి, పాడేరు) ఎవరిని నిలబెట్టాలో తేల్చుకోలేని గందరగోళ పరిస్థితిలో ఉన్నారు. జనసేనకు సంబంధించి ఇప్పటివరకు ఒక్క అనకాపల్లి అసెంబ్లీ స్థానాన్ని మాత్రమే అధికారికంగా ప్రకటించారు. జనసేన నుంచి విశాఖ దక్షిణ, పెందుర్తి, యలమంచిలి స్థానాలు తమకు కేటాయించినట్టు ఆ సీట్లను ఆశిస్తున్న నాయకులే ప్రకటించుకున్నారు తప్ప అధికారిక ప్రకటన విడుదల కాలేదు.

లోక్‌సభ స్థానాల్లోనూ అదే పరిస్థితి

ఉమ్మడి విశాఖ జిల్లాలో మూడు లోక్‌సభ స్థానాల (విశాఖపట్నం, అనకాపల్లి, అరకు)కు కూడా **కూటమి నేతలు అభ్యర్థులను ఖరారు చేయ**లేకపోతున్నారు. విశాఖ లోక్‌సభ సీటు కోసం టీడీపీ నుంచి భరత్, బీజేపీ నుంచి జీవీఎల్ నరసింహారావు పోటీపడుతున్నారు. అనకాపల్లి నుంచి బీజేపీ తరపున సీఎం రమేష్, అరకు నుంచి కొత్తపల్లి గీతలు ఆశిస్తున్నారు. వీరిలో అనకాపల్లి సీఎం రమేష్‌కు, అరకు గీతకు కేటాయించారంటూ ప్రచారం జరుగుతుందే తప్ప అధికారికంగా ప్రకటించలేదు. దీంతో ఈ మూడు లోక్‌సభ స్థానాల అభ్యర్థులు ఎవరన్న దానిపై కూటమిలోనే పెద్ద గందరగోళం, అయోమయ పరిస్థితులు నెలకొన్నాయి. మరో యాభై రోజుల్లో ఎన్నికలు జరగనున్నాయి. నాలుగు వారాల్లోపు నోటిఫికేషన్ విడుదల కానుంది. ఈ నేపథ్యంలో అధికార వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు ప్రచారంలో దూసుకుపోతుంటే.. ఇంకా తమ కూటమి ఉమ్మడి అభ్యర్థులను తేల్చుకోలేక పోతున్నారంటూ టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు ఆవేదన చెందుతున్నాయి.

పొత్తులపై కత్తులు

ఉమ్మడి విశాఖ జిల్లాలో కూటమి పార్టీలు ఇప్పటికే ప్రకటించిన చోట్ల అభ్యర్థులు, ఆశావహుల మధ్య రోజూ 'వార్' జరుగుతోంది.

- టీడీపీ మాడుగుల సీటును ఎన్ఆర్ఐ పైలా ప్రసాదరావుకు కేటాయించింది. ఈ సీటుపై ఆశలు పెట్టుకున్న అక్కడ ఇన్‌చార్జి పీవీజీ కుమార్, మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడులు ఏకమై పైలా అభ్యర్థిత్వాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తూ గెలిచే వారికే సీటివ్వాలంటూ రోడ్డెక్కారు.
- చోడవరం కేఎస్ఎన్ రాజుకు ఖరారు చేయగా, ఆ సీటును ఆశించిన మల్లునాయుడు, ఇన్‌చార్జి తాతయ్యబాబు, జనసేన ఇన్‌చార్జి పీవీఎస్ఎన్ రాజు నిరసన గళం వినిపిస్తున్నారు.
- పాయకరావుపేట టికెట్‌ను టీడీపీ అనితకు కేటాయించడాన్ని అక్కడ జనసేన ముఖ్య నేతలు అంగీకరించడం లేదు. ఆమెను ఓడిస్తామని ఒట్టేసి చెబుతున్నారు.
- అనకాపల్లి స్థానాన్ని జనసేనలో నిన్నగాక మొన్న చేరిన మాజీ మంత్రి కొణతాల రామకృష్ణకు ఇవ్వడాన్ని ఆ సీటును ఆశించి టీడీపీలో చేరిన మాజీ మంత్రి దాడి వీరభద్రరావు జీర్ణించుకోలేకపోతున్నారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పరుచూరి భాస్కరరావు అయితే ఆ పార్టీకే రాజీనామా చేశారు. మరికొంతమంది టీడీపీ నేతలు అసంతృప్తితో ఉన్నారు.
- విశాఖ దక్షిణ సీటును జనసేన నుంచి వంశీకృష్ణ శ్రీనివాస్‌కు ఖరారైందన్న ప్రచారంతో ఆ నియోజకవర్గ జనసేన నాయకులు అగ్గిమీద గుగ్గిలమవుతున్నారు. అక్కడ సీటుపై ఆశలు పెట్టుకున్న మహ్మద్ సాధిక్, డాక్టర్ మూగి శ్రీనివాసరావు, కందుల నాగరాజులు పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడుతున్నారు.
- పెందుర్తి సీటు జనసేన నుంచి పంచకర్ల రమేష్ బాబుకు ఖరారైందన్న ప్రచారంతో అక్కడ టీడీపీ ఇన్‌చార్జి, మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి తీవ్ర అసంతృప్తితో రగిలిపోతున్నారు. నియోజకవర్గంలో ఆయన తమ వర్గంతో ఆందోళనలు నిర్వహిస్తున్నారు. తనకు సీటివ్వకపోతే పంచకర్లను ఓడించి తీరతామని తెగేసి చెబుతున్నారు.
- గాజువాకపై గంపెడాశలు పెట్టుకున్న జనసేన పీఏసీ సభ్యుడు కోన తాతారావును కాదని టీడీపీ నుంచి పల్లా శ్రీనివాసరావుకు కేటాయించడంపై ఆయన తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. ఆయన పల్లాకు ఏ మేరకు సహకరిస్తారన్న దానిపై టీడీపీలోనూ అనుమానాలున్నాయి.
- టీడీపీకి అరకు సీటును సివేరి దొన్నుదొరకు ఖరారు చేయడంతో అక్కడ ఇన్‌చార్జి శివేరి అబ్రహం ఆగ్రహంతో ఉన్నారు. ఇండిపెండెంటుగా పోటీ చేసైనా దొన్నుదొరను ఓడిస్తానని శపథం చేశారు.
- రంపచోడవరం టీడీపీ టికెట్‌ను మిరియాల శిరీషకు కేటాయించడాన్ని అక్కడ మాజీ ఎమ్మెల్యేలు వంతల రాజేశ్వరి, వెంకటేశ్వరరావు ససేమిరా అంటున్నారు. శిరీష అభ్యర్థిత్వానికి వ్యతిరేకంగా ధర్నాలు, ఆందోళనలు చేపడుతున్నారు.

ఇలా టీడీపీ–జనసేనల మధ్య పొత్తు ఉన్నా పలు స్థానాల్లో ఒకరంటే ఒకరు కత్తులు నూరుకుంటున్నారు. బహిరంగంగా వీధికెక్కుతున్నారు.

ఎన్నికల నియమావళి పాటించాల్సిందే

- సువిధ యాప్‌లో అనుమతులు
- వచ్చే నెల 18 నుంచి నామినేషన్ల స్వీకరణ
- కలెక్టర్ విజయసునీత



మాట్లాడుతున్న కలెక్టర్ విజయ సునీత



హాజరైన రాజకీయ పార్టీల నాయకులు

సాక్షి,పాడేరు: సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్ నేపథ్యంలో అన్ని రాజకీయ పార్టీలు ఎన్నికల నిబంధనలను కచ్చితంగా పాటించాలని కలెక్టర్ ఎం.విజయ సునీత ఆదేశించారు. రాజకీయ పార్టీల నేతలతో గురువారం తన కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఎన్నికల నియమావళి, సువిధతోపాటు ఎంసీసీ, సి-విజిల్, ఎంసీఎంసీ యాప్‌లతోపాటు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించే లక్ష్యంతో ఉన్నామని, అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలన్నారు. సువిధ యాప్ ఈ ఎన్నికల ప్రక్రియలో కీలకమని, ఎన్నికల ప్రచారాలు, సభలు, సమావేశాలు, ఊరేగింపులు, ర్యాలీలు, బ్యానర్లు, జెండాలు, ఫ్లెక్సీల ప్రదర్శన, హెలికాప్టర్, హెలిప్యాడ్‌ల వినియోగం, అభ్యర్థులు, ఇతర నాయకుల ప్రచార వాహనాలు ఏర్పాటు తదితర 26 అంశాలకు సంబంధించిన అనుమతులన్నీ సువిధ యాప్ ద్వారానే మంజూరు చేస్తామన్నారు. అన్ని రాజకీయ పార్టీల నేతలు, పార్టీల అభ్యర్థులంతా అనుమతులు కోసం సువిధ యాప్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ప్రతి కార్యక్రమానికి సంబంధించి 45 నిమిషాల ముందుగానే సువిధ యాప్‌లో దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. అనుమతులు లేని అన్ని అంశాలను ఎంసీసీ పరిధిలోకి తీసుకుని సంబంధిత బాధ్యులపై తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బహిరంగ సమావేశాలకు సింగిల్ విండో ద్వారా అనుమతులు పొందాలని, అన్ని ప్రదేశాలలోను వీడియో చిత్రీకరణ చేస్తున్నందున తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. బహిరంగ సమావేశాలు, ర్యాలీలు నిర్వహించినప్పుడు పోలీసులకు లోకేషన్, సమయం తెలియజేస్తూ అనుమతులు పొందాలన్నారు. ఓటర్లను ప్రభావితం చేసే విధంగా విధులు నిర్వహించొద్దని, ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ఎన్నికల ప్రచారానికి మతపరమైన కేంద్రాలు వినియోగించవద్దని సూచించారు. ప్రకృతి వైపరీత్యాల సమయంలో పునరావాస చర్యలు చేపట్టవచ్చన్నారు.

ఏప్రిల్ 18న ఎన్నికల నోటిఫికేషన్

మే 13న జరిగే సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఏప్రిల్ 18న ఎన్నికల నోటిఫికేషన్ ఫారం-1 ద్వారా జారీ చేస్తామని కలెక్టర్ తెలిపారు. ఎన్నికల కమిషన్ ప్రకటన మేరకు ఏప్రిల్ 18 నుంచి 25వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ, 26న పరిశీలన, 29వ తేదీ వరకు విత్‌డ్రాలు, మే 13న ఎన్నికల పోలింగ్, జూన్ 4న కౌంటింగ్ ప్రక్రియ ఉంటుందన్నారు. పార్లమెంట్‌కు పోటీ చేసే అభ్యర్థులు రూ.25 వేలు, అసెంబ్లీకి పోటీ చేసే వారు రూ.10 వేలు సెక్యూరిటీ డిపాజిట్ చెల్లించాలని, ఎస్టీ అభ్యర్థులు మాత్రం మొత్తం డిపాజిట్ సొమ్ములో 50 శాతం చెల్లిస్తే సరిపోతుందన్నారు. ఎంపీ అభ్యర్థులు ఫారం-2ఏ, ఎమ్మెల్యే అభ్యర్థులు ఫారం-2బీలో నామినేషన్ దాఖలు చేయాలన్నారు. సెలవు రోజులు మినహా మిగిలిన రోజుల్లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్లు స్వీకరిస్తామన్నారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలకు ఒకరు, ఇతర స్వతంత్ర అభ్యర్థులకు పది మంది ప్రతిపాదించాలన్నారు. నామినేషన్ దాఖలు సమయంలో అన్ని పత్రాలు జాగ్రత్తగా పరిశీలించుకోవాలని, అవసరమైతే హెల్ప్‌డెస్క్ సహకారం తీసుకోవాలన్నారు. పత్రాలు సక్రమంగా లేకపోతే నామినేషన్లు తిరస్కరణకు గురవుతాయన్నారు. సమావేశంలో డీఆర్‌వో పద్మావతి, ఎస్‌డీసీ పి.అంబేడ్కర్, పలు విభాగాల నోడల్ అధికారులు బాలసుందరబాబు, లీలాప్రసాద్, శివయ్య, గోవిందరాజులు, పలు రాజకీయ పార్టీల నేతలు సీదరి మంగ్లన్నదొర, సుర్ల అప్పారావు, సల్లా రామకృష్ణ, బి.కృష్ణకుమారి, పి.గోవిందరావు, రొబ్బా ఉషారాణి పాల్గొన్నారు.

మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో అదనపు బలగాలు : ఎస్పీ



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ తుహిన్‌సిన్హా

చింతూరు: పోలింగ్ రోజున మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లోని అతి సమస్యాత్మక కేంద్రాలకు అదనపు బలగాలతో గట్టి భద్రత కల్పించాలని ఎస్పీ తుహిన్‌సిన్హా ఆదేశించారు. ఆంధ్రా, ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లో మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లోని అతి సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను ఓఎస్డీ మహేశ్వరరెడ్డి, ఏఎస్పీ రాహుల్‌మీనాతో కలసి ఆయన గురువారం పరిశీలించారు. చింతూరు మండలంలోని అతి సమస్యాత్మకమైన అల్లిగూడెం, పేగ పోలింగ్ కేంద్రాలతోపాటు సమస్యాత్మకమైన సింగన్నగూడెం, తుమ్మల, బొడ్డుగూడెం, సరివెలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలింగ్‌కు ముందురోజు నుంచి ఓటింగ్ పూర్తయి బ్యాలెట్ బాక్సులు తరలించే వరకు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. ఓటర్లతోపాటు పోలింగ్ సిబ్బందికి భద్రత కల్పించాలని సూచించారు. సరిహద్దుల్లోని పోలింగ్ కేంద్రాలపై నిరంతర నిఘా కొనసాగించాలని, మావోయిస్టుల కదలికలపై దృష్టి సారించాలని ఆదేశించారు. చింతూరు సీఐ గజేంద్రకుమార్, ఎస్ఐ శ్రీనివాసరావు పాల్గొన్నారు.



స్వయం ఉపాధికి తోడు



- జగనన్న తోడుతో చిరువ్యాపారుల జీవితాల్లో సంతోషాలు
- రూ.10 వేల చొప్పున రుణాలు మంజూరు చేసిన ప్రభుత్వం
- టీడీపీ హయాంలో రాబందుల్లా పీక్కుతిన్న కాల్‌మనీ కేటుగాళ్లు

సాక్షి, విశాఖపట్నం/ముంచంగిపుట్టు/చింతూరు : తెలుగుదేశం హయాంలో వడ్డీ వ్యాపారంలా మొదలై.. సామాన్యుల పాలిట భస్మాసుర హస్తంలా మారిన కాల్‌మనీ వ్యవహారం అప్పట్లో రాష్ట్ర వ్యాప్తంగా సంచలనంగా మారింది. 'కాల్'యముళ్ల చేతిలో.. అరాచకాలకు గురైన బాధితుల చిట్టా ప్రతి జిల్లాలోనూ లక్షల్లో ఉంది. తవ్వేకొద్దీ వారి అక్రమాలు బయటపడ్డాయి. అధిక వడ్డీలకు రుణాలు ఇవ్వడమే కాకుండా.. తీసుకున్న అప్పు చెల్లించిన తర్వాత కూడా బాకీ ఉన్నారంటూ వేధింపులకు గురిచేసిన ఉదంతాలెన్నెన్నో.. మనిషి ఆర్థిక అవసరాలనే బలహీనతగా చేసుకుని.. వేలాది కుటుంబాలను రోడ్డున పడేసే వడ్డీ భూతాలు పీక్కుతిన్న పాపాల రోజులను ప్రజా సంకల్పయాత్రలో చూసి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చలించిపోయారు. అధికారంలోకి వచ్చిన తర్వాత వడ్డీ భారం లేకుండా చిరు వ్యాపారులకు బ్యాంకుల ద్వారా రుణాలు మంజూరు చేశారు. చిరు వ్యాపారం చేస్తున్న వారు ఆత్మస్థైర్యంతో ఆర్థికంగా వృద్ధిలోకి వచ్చేలా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన పథకమే జగనన్న తోడు.

చిన్న చిన్న వ్యాపారాలు చేసుకునే వారు.. రోజువారీ అవసరాల కోసం వడ్డీ వ్యాపారుల వద్ద చేయి చాచేవారు. 2014–19 మధ్య కాలంలో ఈ వడ్డీ బకాసురులు పేదల అవసరాలను బట్టి వందకు 5 నుంచి 10, 20, 30 రూపాయలు సైతం వడ్డీగా వసూలు చేసేవారు. 10 వేలు అప్పు కావాలంటే 9 వేలు ఇచ్చేవారు. సాయంత్రం సరికి 500 రూపాయల వడ్డీ వారి చేతిలో పెట్టాల్సిందే. లక్ష కావాలంటే 75 వేల రూపాయలిచ్చేవారు. 10 నెలల్లో మొత్తం లక్ష రూపాయలు చెల్లించాలి. గడువు దాటితే.. రోజుకు వెయ్యి రూపాయలు అదనంగా చెల్లించాల్సి ఉండేది. ఉదయం లక్ష రూపాయలు అప్పించారంటే... రాత్రయ్యే సరికి వెయ్యి నుంచి రెండు వేల రూపాయల వడ్డీ కట్టాల్సిందేనంటూ నిరుపేదలను నరకం చూపించేవారు.

2019 నుంచి ఆ దుర్భర పరిస్థితి పూర్తిగా దూరమైంది. వడ్డీ వ్యాపారుల విష వలయంలో చిక్కుకోకుండా.. చిరువ్యాపారులకు చేయూతనందించేలా వడ్డీలేని రుణాలను వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అందజేసింది.

ఎనిమిది విడతల్లో...

చిన్న చిన్న దుకాణాలు నడిపేవారు, కూరగాయల వ్యాపారులు, పండ్లు, ఆహారపదార్థాలు అమ్ముకుని జీవించేవారు, రోడ్ల పక్కన టిఫిన్ సెంటర్లు నిర్వహించేవారు, సైకిల్, మోటార్ సైకిల్, ఆటోలపై వెళ్లి వ్యాపారం చేసుకునేవారు, గంపలు, బుట్టలతో వస్తువులు అమ్మేవారు, హస్త కళాకారులు, సంప్రదాయ చేతివృత్తుల వారు వారి కాళ్లమీద వారు నిలదొక్కుకునేలా జగనన్న తోడు పథకం కింద ఆర్థిక చేయూతనిచ్చింది. ఒక్కొక్కరికీ ఏటా రూ.10 వేల రుణం సున్నా వడ్డీకే అందజేసింది. రుణాలను సకాలంలో చెల్లించిన వారికి ఏడాదికి మరో రూ.1000 చొప్పున జోడిస్తూ రూ.13,000 వరకూ వడ్డీలేని రుణం అందించింది. వడ్డీని సైతం లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో ప్రభుత్వమే జమ చేసింది. ఇలా ఇప్పటి వరకు 8 విడతల్లో రుణాలు అందజేసింది.

'జగనన్న తోడు'గా నిలిచారు



నా పేరు శ్యామల శాంత. మాది అల్లూరి జిల్లా చింతూరు గ్రామం. శబరిఒడ్డున జీవనం సాగిస్తున్నా. గతంలో నా భర్త మృతి చెందాడు. ఒక కుమార్తెకు వివాహం చేయగా, రెండో కుమార్తెతో కలసి సంతల్లో చిన్నపాటి కూరగాయల వ్యాపారం చేస్తున్నా. జగనన్న తోడు ద్వారా ఏడాదికి రూ.10 వేలు వడ్డీలేని రుణం ఇవ్వడంతో చిన్నపాటి వ్యాపారంలో పెట్టుబడికి ఎంతో ఉపయోగంగా ఉంటోంది. గతంలో పెట్టుబడి కోసం బయట అప్పు తీసుకుంటే అధిక వడ్డీలు కట్టలేక ఇబ్బందులు పడాల్సి వచ్చేది. వచ్చిన రాబడిలో అప్పులు తీర్చడానికే సరిపోయేది. ప్రస్తుతం జగనన్న తోడు రుణం ఇచ్చి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అండగా నిలిచారు. ఆయన రుణం తీర్చుకోలేనిది.

జగనన్న తోడు ఇలా...

విశాఖ జిల్లాలో లబ్ధిదారులు	56,537
అందించిన మొత్తం రూ.	82.81 కోట్లు
అనకాపల్లి జిల్లాలో లబ్ధిదారులు	1,30,370
అందించిన మొత్తం రూ.	132.47 కోట్లు
అల్లూరి జిల్లాలో లబ్ధిదారులు	3,180
అందించిన మొత్తం రూ.	24.96 కోట్లు

జగనన్న సాయం.. కొండంత ధైర్యం



నా పేరు కోటిపల్లి నాగరత్నం, మాది బోడపాలెం గేమం. కోటవురట్ల మండలం. నేను కిరాణా వేపారం సేత్తన్నాను. వేపారం కోసం ఏటా వడ్డీకి అప్పు తెచ్చి పెట్టుబడి పెట్టేదాన్ని. అప్పు తెచ్చి పెట్టుబడి పెట్టడం వల్ల నాభం వచ్చినా ఆళ్ల అప్పులు తీర్చడానికే సరిపోయేది. పడిన కట్టం అంతా వడ్డీకే పోయేది. అప్పుల్లో కూరుకుపోడమే తప్ప పడిన కట్టానికి ఫలితమే లేకుండాపోయింది. ఐదేళ్లుగా నా పరిస్థితి బాగుంది. జగనన్న తోడు కింద ఏటా రూ.10 వేలు ఇత్తన్నారు. వడ్డీ లేకుండా అప్పు ఇవ్వడం వల్ల లాభాలు మిగులుతున్నాయి. అప్పులోళ్ల బాధ నేదు. జగనన్న తోడు పెట్టుబడితో ధైర్యంగా వేపారం చేసుకుంటున్నాను. నా కుటుంబం కోసం ఏటా కొంత డబ్బులు పక్కన పెడుతున్నాను. మాలాంటి చిన్న వేపారాలు చేసేటోళ్లకు ఎంతో ఆదుకుంటోంది. జగన్‌బాబు సల్లగా ఉండాల.

జగన్‌బాబు దయవల్ల యాపారం బాగుంది



నా పేరు పద్మావతి.. మాది ముంచ్చంగిపుట్టు(ముంచంగిపుట్టు). రెక్కాడితే గాని డొక్క నిండని పరిచ్చితి నాది. నాను కొబ్బరిక్కాయలు, పళ్ల యాపారం చేత్తన్నా. ప్రతి సారి యాపారం కోసం అప్పోసప్పో చేయల్సొచ్చేది. సరుకులమ్మి వచ్చిన డబ్బుతో వడ్డీ చెల్లించేసరికి పేణం పోయినంత పనయ్యేది. దీంతో వ్యాపారంలో ఎటువంటి లాభం లేకపోయేది. ఒక్కోసారి నష్టాలు వస్తే తీసుకున్న అప్పు సైతం చెల్లించలేక అట్టకట్టాలు పడేదాన్ని. జగన్‌బాబు దయవల్ల అప్పుల బాధ తప్పింది. జగనన్న తోడు ద్వారా రూ.10 వేలు ఇత్తన్నారు. దీంతోపాటు ఆసరా, డ్వాక్రా రుణాల ద్వారా లచ్చ వరకు అందుకున్నా. వితొంతు ఫెంచన్ వత్తంది. యాపారం చేస్తూ రోజుకు రూ.2 వేల నుంచి రూ.3 వేల వరకు అమ్ముతున్నా. తిండికి, బట్టలకు లోటు లేదు. జగన్‌బాబు దయవల్ల సంతోషంగా బతుక్కుతున్నా.

క్లుప్తంగా

అప్పన్నకు విశేషంగా ఏకాదశి ఆర్జిత సేవలు



స్వర్ణ తులసీదళాలతో ప్రదక్షిణ చేస్తున్న అధికారులు, అర్చకుడు, భక్తులు

సింహాచలం : ఏకాదశిని పురస్కరించుకుని శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు విశేషంగా నిర్వహించారు. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణ తులసీ దళార్చన వైభవంగా జరిపారు. ఆలయ బేడా మండపంలో స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేదికపై వేంజేపచేశారు. 108 స్వర్ణ సంపెంగలతో స్వామికి అష్టోత్తర శతనామావళి పూజ నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేష వస్త్రాలు, ప్రసాదం అందజేశారు. ఆలయ ఏఈవో ఎస్. ఆనంద్‌కుమార్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

శాస్త్రోక్తంగా నిత్య కల్యాణం

శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామికి గురువారం 9.30 గంటల నుంచి నిత్య కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి, భూదేవిలను బేడా మండపంలో వేదికపై వేంజేపచేశారు. విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్ర బెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణాన్ని నిర్వహించారు.

వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శిగా రమణమూర్తి



సాక్షి, విశాఖపట్నం: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శిగా డాక్టర్ పి.వి.రమణమూర్తిని నియమించారు. ఈ మేరకు గురువారం పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. వైద్యసేవలందిస్తూ పేరు ప్రఖ్యాతలు పొందిన రమణమూర్తి 2019లో వైఎస్సార్‌సీపీ విశాఖ దక్షిణ సమన్వయకర్తగా కూడా పనిచేశారు. తనను రాష్ట్ర కార్యదర్శిగా నియమించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, పార్టీ రీజనల్ కోర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డికి రమణమూర్తి కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థుల గెలుపునకు కృషిచేస్తానని పేర్కొన్నారు.

అంగరంగ వైభవంగా వెంకన్న కల్యాణం



వడ్డాదిలో పూజలందుకున్న శ్రీదేవి, భూదేవి నడుమ వేంకటేశ్వరస్వామి



ఉపమాకలో సింహాద్రాచార్యులు ఇంటి వద్ద ఎదురు సన్నాహ మహోత్సం సందర్భంగా పెళ్లిమాటల తంతును వివరిస్తున్న గాయత్రీదేవి

ఉపమాకలో పులకించిన భక్తజనం

నక్కపల్లి: ఉపమాకలో బ్రహ్మాండనాయకుని వార్షిక కల్యాణం బుధవారం అర్ధరాత్రి అంగరంగవైభవంగా జరిగింది. దేవదేవుని తిరుకల్యాణం తిలకించేందుకు భక్తులు వేల సంఖ్యలో తరలి వచ్చారు. తిరుపతి, ఉపమాకలకు చెందిన అర్చక స్వాములు వేద పండితులు, గొట్టుముక్కల వరప్రసాద్, సంకర్షనపల్లి కృష్ణమాచార్యులు, పీవీ శేషాచార్యులు ఈ కల్యాణ ఘట్టాన్ని వైభవంగా నిర్వహించారు. కల్యాణానికి ముందుగా ఉపమాకకు చెందిన సింహాద్రాచార్యుల ఇంటి వద్ద స్వర్ణాలంకరణ భూషితుడైన వేంకటేశ్వరస్వామిని ఇత్తడి గరుడ వాహనంపైన, పట్టువస్త్రాలు బంగారు ఆభరణాలతో ముస్తాబైన, శ్రీదేవి, భూదేవిని శేషవాహనంపైన ఎదురెదురుగా ఉంచి పెళ్లి మాటల తంతును నిర్వహించారు. స్వామివారి గొప్పతనాన్ని, గుణగణాలను, సౌశీల్యాన్ని, అమ్మవార్ల గుణగణాలను ప్రముఖ తెలుగు పండితురాలు డాక్టర్ వేదాల గాయత్రీ దేవి భక్తుల కళ్లకు కట్టినట్టు వివరించారు. రథోత్సవం అనంతరం కల్యాణతంతు ప్రారంభమైంది. స్వామివారికి టీటీడీ తరఫున అధికారులు పట్టువస్త్రాలు సమర్పించారు. నర్సీపట్నం డీఎస్పీ మోహన్ పర్యవేక్షణలో నక్కపల్లి.పాయకరావుపేట, అడ్డురోడ్డు సీఐ విజయ్‌కుమార్, అప్పలరాజు, అప్పన్నల ఆధ్వర్యంలో భద్రతా ఏర్పాట్లు చేశారు.

వడ్డాది వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

బుచ్చెయ్యపేట : ప్రసిద్ధి చెందిన వడ్డాది వేంకటేశ్వరస్వామి 151వ కల్యాణ మహోత్సవాల్లో భాగంగా రెండో రోజు స్వామి దర్శనం కోసం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. పలువురు భక్తులు తలనీలాలు సమర్పించి పెద్దేరు నదిలో స్నానాలు ఆచరించి మొక్కులు తీర్చుకున్నారు. గురువారం ఉదయం నుంచి స్వామివారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పలువురు భక్తులు గోవింద నామ స్మరణతో ప్రత్యేక భజనలు చేశారు. స్థానిక వేంకటేశ్వరస్వామి సేవా సమితి సభ్యులు భోజన వసతి కల్పించారు. మూడోరోజు శుక్రవారం సాయంత్రం శ్రీదేవి, భూదేవి, వేంకటేశ్వర స్వామి ఉత్సవ విగ్రహాలతో గజ, గరుడ వాహనాలపై తిరువీధి ఉత్సవం నిర్వహిస్తామని దేవస్థానం ఈవో శర్మ తెలిపారు.

శిరీష అభ్యర్థిత్వంపై నిరసన గళం

వంతలకు టికెట్ ఇవ్వాలని తెలుగు తమ్ముళ్ల డిమాండ్



చింతూరు మండలం వీరాపురంలో జరిగిన సమావేశంలో పాల్గొన్న నాయకులు

చింతూరు: రంపచోడవరం టీడీపీ అభ్యర్థిని మిరియాల శిరీష అభ్యర్థిత్వానికి వ్యతిరేకంగా విలీన మండలాల్లోని తెలుగు తమ్ముళ్లు నిరసన గళం వినిపిస్తున్నారు. విలీన మండలాలకు చెందిన నాయకులను పరిచయం చేసుకునేందుకు తొలిసారిగా చింతూరు వచ్చిన సమయంలోనే ఆమె పట్ల వ్యతిరేకత వ్యక్తం కావడం చర్చనీయాంశంగా మారింది. ఆ పార్టీ చింతూరు మండల మాజీ అధ్యక్షుడు ఎండీ జహంగీర్ ఆధ్వర్యంలో వీరాపురంలో గురువారం సమావేశమయ్యారు. చిడుమూరు మాజీ ఎంపీటీసీ సభ్యుడు బొక్కిలి ప్రసాద్, సర్పంచ్ బొక్కిలి మల్లయ్య, కొత్తపల్లి మాజీ సర్పంచ్ కరణం లక్ష్మణ్, సీనియర్ నాయకుడు బొక్కిలి రాంబాబు, మైనార్టీ నాయకులు ఎండీ రియాజ్, ఎస్కే జాఫర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విలీన మండలాల్లో పార్టీ పటిష్టత కోసం పాటుపడిన వంతల రాజేశ్వరికి టికెట్ కేటాయించకుండా కొత్త వ్యక్తి శిరీషకు ఎలా ఇస్తారని ప్రశ్నించారు. ఐదేళ్లపాటు ప్రతిపక్షంలో ప్రజా సమస్యలపై పోరాడుతూ ఎల్లప్పుడూ కార్యకర్తలకు అండగా ఉంటున్న వంతలకే టికెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు. అధిష్టానం పునరాలోచించి ఆమెకు టికెట్ కేటాయించే వరకు పోరాటం కొనసాగిస్తామని ఏకగ్రీవ తీర్మానం చేసినట్లు వారు తెలిపారు.

టేకు వనాలను తనిఖీ చేసిన విజిలెన్స్



లాగరాయి ఫారెస్టు బీట్‌లో టేకు వనాలను తనిఖీ చేస్తున్న విజిలెన్స్ అధికారులు

రాజవొమ్మంగి: స్థానిక అటవీ క్షేత్రంలోని లాగరాయి బీటులో 61 హెక్టార్లలో టేకు వనాలను విశాఖపట్నం విజిలెన్స్ అధికారుల బృందం గురువారం సాయంత్రం పరిశీలించింది. రేంజ్ అధికారి గంగరాజు నేతృత్వంలో ఇరువురు ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్లు, ఎఫ్‌బీవో పాల్గొన్నారు. ఈ ప్రాంతంలో 1973–74 మధ్య 52 హెక్టార్లలో నాటిన టేకు చెట్లను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించారు. హెక్టారులో ఎన్ని చెట్లు బతికి ఉన్నాయి, ఎన్ని చనిపోయాయి, బతికి ఉన్న చెట్ల కొలతలు పరిగణనలోకి తీసుకున్నారు. అదేవిధంగా ఇటీవల కాలంలో ఈ వనాల నుంచి ఏవైనా టేకు చెట్లు చోరీకి గురయ్యాయా అన్న కోణంలో ఆరా తీశారు. నివేదికను అటవీశాఖ ఉన్నతాధికారులకు అందజేస్తామన్నారు. టేకు వనాలను కంటికి రెప్పలా కాపాడాలని స్థానిక అటవీ శాఖ అధికారులకు సూచించారు. మన్యంలో రహదారులు గతంలో కంటే మెరుగుపడటంతో కలప అక్రమ రవాణాకు అవకాశం ఉంటుందని, దీనిపై గట్టి నిఘా పెట్టాలని హెచ్చరించారు. స్థానిక ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్ రాము, ఎఫ్‌బీవో ఆనందబాబు పాల్గొన్నారు.

ఆటో బోల్తా – మహిళకు గాయాలు



గోకురాయి ఘాట్‌రోడ్డులో బోల్తా పడిన ఆటో



చికిత్స పొందుతున్న వరహాలమ్మ

పెదబయలు: మండలంలోనిగిన్నెలకోట పంచాయతీ చింతగరువు గ్రామ సమీపంలో గోకురాయి ఘాట్‌రోడ్డులో గురువారం ఆటో బోల్తా పటిన సంఘటనలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. సంఘటన వివరాలు.. గిన్నెలకోట పంచాయతీ లండూలు గ్రామం నుంచి జి.మాడుగుల మండల మద్దిగరువు వారపు సంతకు 10 మంది ప్రయాణికులతో బయలుదేరిన ఆటో చింతగరువు గ్రామ సమీపంలోని గోకురాయి ఘాట్ రోడ్డులో అదుపు తప్పి బోల్తా పడింది. ఆటోలో ప్రయాణిస్తున్న జి.మాడుగుల మండలం కిల్లంకోట పంచాయతీ సువ్వాపల్లి గ్రామానికి చెందిన బుటారి వరహాలమ్మ కాలు, శరీర భాగాలకు గాయాలయ్యాయి. మరో ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులకు 108 వాహనంలో గోమంగి పీహెచ్‌సీకి తరలించి ప్రాథమిక వైద్యం అందించారు. అనంతరం పాడేరు జిల్లా ఆస్పత్రికి వైద్యులు సిఫార్సు చేశారు.ఆటో బ్రేకులు ఫెయిల్ అయివడంతో పాటు డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించడంతో ప్రమాదం తప్పిందని లేని పక్షంలో పక్కనే ఉన్న లోయపడి పడి ప్రాణనష్టం జరిగి ఉండేదని ప్రయాణికులు చెప్పారు.

టీడీపీ నాయకులపై ఫిర్యాదు



పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న సోషల్ మీడియా ప్రతినిధులు

అరకులోయ రూరల్: సోషల్ మీడియా వేదికగా స్థానిక ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, అరకు అసెంబ్లీ అభ్యర్థి రేగం మత్స్యలింగంలపై వ్యక్తిగతంగా దుష్ప్రచారం చేస్తున్న టీడీపీకి చెందిన కొంతమందిపై గురువారం స్థానిక పోలీసులకు ఫిర్యాదు అందింది. ఈ సందర్భంగా సోషల్ మీడియా ప్రతినిధులు నర్సింగ్, చాణక్య, విజయ్ మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో ఓటమి భయంతోనే టీడీపీ నాయకులు కుట్ర పన్నుతున్నారన్నారు. వ్యక్తిగత మనోభావాలను దెబ్బతీసే విధంగా వాట్సాప్, ఫేస్‌బుక్ తదితర సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ప్రచారం చేస్తున్నారని, వారిపై శాఖా పరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఘనంగా పొగును పండగ



పూజలు చేస్తున్న భక్తులు

అనంతగిరి: మండల కేంద్రంలోని పెద్దూరులో పొగును (హోలీ) పండగ గురువారం గిరిజనులు ఘనంగా నిర్వహించారు. గిరిజన సంప్రదాయ ప్రకారం ఏటా ఈ పండగను నిర్వహిస్తారు. ఒడిశా, ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చి, ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం నుంచి పోతురాజు గుడి వద్ద భక్తులతో సందడి మారింది. రాత్రి పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. థింసా నృత్యాలు చేశారు.

పండగ ప్రత్యేకత: సుమారు 20 అడుగులు ఎత్తులోని కర్రలను పేర్చి, మధ్యలో జెండాను ఏర్పాటు చేస్తారు. శుక్రవారం ఉదయం నాలుగు గంటలకు సమయంలోని ప్రత్యేక పూజలు నిర్వహించి, నిప్పుపెడతారు. జెండా ఎటువైపు పడుతుందో ఆయా గ్రామాల్లో ఆ ఏడాదంతా పంటల సమృద్ధిగా పండుతాయని గిరిజనులు నమ్మకం. ఈ ఆచారం పూర్వీకుల నుంచి ఆనవాయితీగా వస్తోందని గ్రామపెద్దలు చెప్పారు.

సిరులు కురిపిస్తున్న బర్లీ పొగాకు

రాజవొమ్మంగి: మన్యంలో వేసవి పంటగా వైట్‌బర్లీ పొగాకు పంట రైతులకు కాసులు కురిపిస్తోంది. నాటిన వంద రోజుల్లో పంట చేతికి రావడంతో పాటు పండిన పంటను ప్రముఖ ఐటీసీ, ఎంఎల్ వంటి కంపెనీలు వెంట వెంటనే కొనుగోలు చేస్తుండడంతో గిరి రైతులు ఈ పంట సాగుపై మక్కువ పెంచుకొంటున్నారు. ఈ పంటకు గరప నేలలు అనుకూలం కాగా ఇప్పుడిప్పుడే వరి పండే భూముల్లో కూడా రైతులు పొగాకు పండిస్తున్నారు. ఎకరాకు 10వేల మొక్కలు నాటితే 500 నుంచి 800కిలోల దిగుబడి సాధిస్తున్నారు. మార్కెట్‌లో క్వింటా రూ. 15వేలతో రూ.1.20 లక్షల ఆదాయాన్ని రైతులు సముపార్జిస్తున్నారు. దుక్కు, నారు, ఎరువులు, పురుగుమందులకు ఖర్చులు పోగా సుమారు రూ. 90వేల వరకు నికర ఆదాయం లభిస్తుందని రాజవొమ్మంగికి చెందిన రైతు నక్కా వర ప్రసాద్ సంతోషం వ్యక్తం చేశారు. ఐటీసీ కంపెనీ అనేక రాయితీలు ప్రకటించడం కూడా పొగాకు రైతులకు కలసి వస్తోందంటున్నారు. కష్టపడిన దానికి ప్రతి ఫలం తక్కుతుందని రైతులు చెబుతున్నారు. రాజవొమ్మంగి పరిసర ప్రాంతాల్లో వేసవి పంటగా సుమారు 1500 ఎకరాల్లో పొగాకు సాగు చేస్తున్నారు. పొగాకు ధర గతంలో క్వింటా రూ. 10వేలు ఉండేదని, ఇప్పుడు ధర రూ.15వేలకు పెరగడంతో రైతులు ఈ పంటపై ఆసక్తి కనపరుస్తున్నారు. సిగరెట్లలో తయారీలో వర్జీనియా పొగాకుకు వైట్‌బర్లీ పొగాకు కలుపుతారు. అయితే మన్యంలో పండే బర్లీ పొగాకు నాణ్యత, మంచి రంగు, సువాసన కలిగి ఉండటంతో ఈ పొగాకు విదేశాల్లో గిరాకీ ఏర్పడింది. దీంతో ఇక్కడ పండే బర్లీ పంటకు మార్కెట్‌తో పాటు మంచి ధర కూడా లభిస్తుండటంతో రైతుల ఈ సాగులో ఆశలు పెంచుకొంటున్నారు. ఏటేటా ఈ సాగు విస్తీర్ణం పెంచుతున్నారు.

మిడ్ డే మీల్స్‌కు ఆటంకం లేకుండా రేషన్

డీఎం పార్వతీశ్వరరావు



మాట్లాడుతున్న డీఎం పార్వతీశ్వరరావు

మారేడుమిల్లి: ఏజెన్సీ స్కూళ్లలో మిడ్ డే మీల్స్‌కు రేషన్ బియ్యం సరఫరాకు తగు చర్యలు తీసుకుంటున్నట్టు రంపచోడవరం జీసీసీ డివిజనల్ మేనేజర్ జి. పార్వతీశ్వరరావు పేర్కొన్నారు. ఏజెన్సీలోని కొన్ని పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం పథకానికి రేషన్ బియ్యం సరిగా రావడం లేదని సంబంధిత అధికారులు రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే దృష్టికి రాగా, వెంటనే స్పందించి ముగ్గురు అధికారులతో కమిటీ ఏర్పాటు చేశారు. ఈ మేరకు మారేడుమిల్లి జీసీసీ కార్యాలయంలో కమిటీ సభ్యులైన డీఎస్‌వో శ్యామ్‌కుమార్, డిజిటల్ సివిల్ సప్లయి అధికారి సి. శ్రీహరి, డిప్యూటీ తహసీల్దారు బాలాజీ, డీఎం రేషన్ డీలర్లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మిడ్ డే మీల్స్‌కు సంబంధించిన నిల్వ బియ్యం డీలర్లు ఎందుకు ఇవ్వడంలేదని విచారించారు. దీంతో డీలర్లు పలు సమస్యలను కమిటీకి వివరించారు. వీటిని సత్వరమే పరిష్కరించాలని పీవో అధికారులను ఆదేశించారు. మారేడుమిల్లి సీనియర్ మేనేజర్ ముర్ల నాగ వెంకట రాజారెడ్డి, జీసీ గొడౌన్ ఇన్‌చార్జి, తదితరులు పాల్గొన్నారు.

పరామర్శకు వచ్చి.. మృత్యు ఊబిలో చిక్కి..

- శారదా నదిలో మునిగి ఒకరు మృతి
- మరొకరి పరిస్థితి విషమం
- దయాల్‌నగర్‌లో విషాదఛాయలు



రామకృష్ణను 108లో తరలిస్తున్న దృశ్యం

చోడవరం రూరల్/ పెదగంట్యాడ: మాడుగుల దగ్గరలోని భోగాపురంలో బంధువులను పరామర్శించడానికి వెళ్లి వస్తూ గోవాడ దరి శారదా నదిలో స్నానానికని దిగి ఒకరు ప్రాణం కోల్పోగా, మరొకరు ప్రాణాలమీదికి తెచ్చుకున్న ఉదంతమిది. ఈ విషాద ఘటనలో పెదగంట్యాడ మండలం దయాల్‌నగర్‌లో నివసిస్తున్న పెంటకోట కొండబాబు కుమారుడు యుగంధర్(31) మృతి చెందగా, అదే ప్రాంతానికి చెందిన భీశెట్టి రామునాయుడు కుమారుడు రామకృష్ణ అపస్మారక స్థితిలో అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. చోడవరం సీఐ బి.శ్రీనివాసరావు తెలిపిన వివరాలివీ.. దయాల్‌నగర్‌కు చెందిన యుగంధర్, రామకృష్ణ గురువారం ఉదయం మాడుగులలో బంధువులను పరామర్శించడానికి వెళ్లారు. తిరుగు ప్రయాణంలో గోవాడ వద్ద శారదా నదిలోకి దిగారు. లోతు తెలియక నదిలో యుగంధర్ గల్లంతు కావడంతో రక్షించేందుకు రామకృష్ణ ప్రయత్నించాడు. అతడు కూడా నీటమునగడంతో కేకలు వేశాడు. సమీపంలోని వారు వచ్చి అతడిని నది ఒడ్డుకు లాగారు. అనంతరం 108 వాహనంలో చోడవరం ప్రభుత్వాస్పత్రికి తరలించగా ప్రాథమిక చికిత్స అనంతరం ఎన్టీఆర్ ఆస్పత్రికి పంపించారు. సమాచారం అందుకున్న చోడవరం అగ్నిమాపక కేంద్రం సిబ్బంది ప్రమాదస్థలికి చేరుకుని యుగంధర్ మృతదేహాన్ని వెలికి తీశారు. అతని తల్లి వరలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు. శవపంచనామా అనంతరం మృతదేహాన్ని అనకాపల్లి ఆస్పత్రికి తరలించారు. రామకృష్ణ అనకాపల్లి ఆస్పత్రిలో కోలుకుంటున్నట్టు సీఐ తెలిపారు.

దయాల్‌నగర్‌లో విషాదం

యుగంధర్ మృతితో దయాల్‌నగర్‌లో విషాదఛాయలు అలముకున్నాయి. అతని కుటుంబం 30 ఏళ్ల కిందట భోగాపురం నుంచి ఇక్కడకు వలస వచ్చింది. అతని తండ్రి మరణించగా.. తల్లితో కలిసి నివాసం ఉంటున్నాడు. బతుకుదెరువు కోసం దుబాయ్ వెళ్లిన యుగంధర్.. ఇటీవల ఇండియా చేరుకున్నాడు. తన స్వగ్రామమైన భోగాపురంలోని బంధువు అంత్యక్రియలకు హాజరై తిరిగి వస్తూ శారదానదిలో స్నానానికి దిగాడు. ఊబిలో కూరుకుపోయి ఊపిరాడక మృతి చెందాడు. అనకాపల్లిలోని ఎన్టీఆర్ ఆస్పత్రిలో యుగంధర్ మృతదేహానికి పోస్టుమార్టం పూరి చేసి దయాల్‌నగర్‌కు అతని మృతదేహాన్ని తీసుకువచ్చారు. అతని తల్లి వరలక్ష్మి, బంధువులు, స్నేహితులు విషాదంలో మునిగిపోయారు. చేతికి అందివచ్చిన కుమారుడు అనంతలోకాలకు వెళ్లిపోయాడని, త్వరలోనే పెళ్లి చేయాలని అనుకున్నానంటూ ఆ తల్లి రోదించిన తీరు అక్కడి వారిని కలచివేసింది.